క్లుప్తంగా

పాఠశాలలు పునః ప్రారంభం

మాచర్ల: వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పునః ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో ఉదయం నుంచి విద్యార్థులు పాఠశాలలకు చేరుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మొదటి రోజు విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు ఎంఈవోలు వేముల నాగయ్య, అల్లి సురేష్‌లు విద్యార్థులకు పంపిణీ చేశారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాల కిట్‌లను అందజేశారు. మాచర్ల మండలంలో ఇప్పటి వరకు 40 వేల మంది విద్యార్థులకు సంబంధించి కిట్‌లు మండల కార్యాలయానికి చేరుకున్నాయన్నారు. వారంలో పంపిణీ పూర్తి చేస్తామని ఎంఈవోలు వేముల నాగయ్య, అల్లి సురేష్‌లు తెలిపారు.

మాచర్లలో ప్రశాంత వాతావరణం

మాచర్ల: నియోజకవర్గంలో ఎన్నికల తరువాత జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పికెటింగ్, తనిఖీల కార్యక్రమం ఎస్పీ మలికా గార్గ్, మాచర్ల అర్బన్ సీఐ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో కొనసాగుతోంది. గురువారం మాచర్ల పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇంటి వద్ద, నెహ్రూనగర్ ప్రాంతం, రింగ్ రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డుతోపాటు పలు ప్రాంతాల్లో రామాటాకీస్, చెన్నకేశవ దేవాలయం, పాతూరులో మున్సిపల్ కార్యాలయం వద్ద, కేసీపీకి వెళ్లే రహదారిలో పోలీసు బందోబస్తు కొనసాగుతుంది. 24 గంటలూ పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. అనుమానితులను ప్రశ్నిస్తూ, తనిఖీలు చేస్తున్నారు. ముమ్మరంగా బందోబస్తు ఏర్పాటు చేసి, అల్లర్లు జరిగిన రోజు నుంచి పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం నెలకొంది.

ఘనంగా రుద్రహోమం



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో గల అయ్యప్పస్వామి సహిత గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడోరోజు గురువారం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ రుద్రహోమం జరిపించారు. ఆలయ అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని స్వామి వారిని విశేషంగా అలంకరించారు. పలు గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

15 నుంచి ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు

శావల్యాపురం: ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులను మండల ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో–2 పుసులూరి లలితా కుమారి అన్నారు. గురువారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎంఈవో మాట్లాడుతూ ఈనెల 15, 16, 17 తేదీల్లో స్టెప్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామంలో మూడు రోజుల పాటు ఉచితంగా పరిపూర్ణ వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. నేటి విద్యార్థుల్లో ఉపాధ్యాయుల్లో తల్లిదండ్రులతో ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికి తీయడానికి ఈ శిక్షణ తరగతులు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారికి ఉచిత భోజన వసతి ఏర్పాటు చేయడమే కాకుండా, అనుభవం కల్గిన సైకాలజిస్టులు, వ్యక్తిత్వ వికాస నిపుణులతో శిక్షణా తరగతులు నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 9666813833, 7386883244 సెల్ నంబర్లలో సంప్రదిచాలన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో స్టాక్ రిజిస్టర్ల ఆవిష్కరణ



శావల్యాపురం: స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎస్టీయూ ఉపాధ్యాయుల మండల శాఖ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన స్టాక్ రిజిస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఎంఈవోలు మద్దికుంట సాంబశివరావు, పుసులూరి లలితాకుమారిల సారథ్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మద్దికుంట సాంబశివరావు మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించే మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన సమగ్ర వివరాలన్నీ ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు ఈ రిజిస్టర్‌లో సులభతరంగా నమోదు చేసుకునేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఇలాంటి రిజస్టర్లు అన్ని పాఠశాలలకు ఎస్టీయూ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నేతలు కొండ్రముట్ల వెంకటరత్నం, బిళ్ళ రాజా రమేష్, మండల అధ్యక్షులు కంప శ్రీనివాసరావు, బెజవాడ నాగేశ్వరరావు, రాధాకృష్ణమూర్తి, నిర్మల కుమారి తదితరులు పాల్గొన్నారు.

చినుకు కురిసే.. సాగు మొదలయ్యే



పొలంలో అరకతో సాళ్లు వేస్తున్న రైతు



పొలంలో పత్తి విత్తనాలు నాటుతున్న మహిళలు

- వర్షం కురవటంతో పదునైన భూమి
- సాగు మొదలు పెట్టిన రైతులు
- పత్తి విత్తనాలు నాటుతున్న రైతులు

పిడుగురాళ్ల: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతుల పంట పొలాలు పదును అవ్వటంతో రైతులు తమ పంట పొలంలో పత్తి విత్తనాలు నాటే కార్యక్రమాన్ని గురువారం మొదలు పెట్టారు. పిడుగురాళ్ల పరిసర ప్రాంతాలలోని రైతులు ఇప్పటికే పొలాన్ని చదును చేసుకుని సిద్ధం చేశారు. భూసార పరీక్షలు నిర్వహించి సేంద్రియ ఎరువులతో భూమికి కావాల్సిన పోషకాలను సాగుకు ముందుగానే ఎరువు తోలించారు. అనంతరం లో దుక్కులు దున్నించి పంట పొలాలన్నీ భూసారంతో కలిసే విధంగా చేశారు. ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో రైతులు విత్తనాలు నాటేందుకు సర్వం సిద్ధం చేశారు. ఈ క్రమంలోనే వర్షాలు కురుస్తుండటంతో రైతులు పొలాల్లో అరకలతో సాళ్లు ఏర్పాటు చేసి వాటిల్లో మహిళా కూలీలతో సాళ్ల మధ్యలో పత్తి విత్తనాలు నాటుతున్నారు. వర్షాలు కురుస్తుండటంతో రైతులు తమ పంట పొలాల్లో విత్తనాలు నాటే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు.

అతిసారపై ఇంటింటి సర్వే.. మెడికల్ క్యాంప్



రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని వడ్డెర బావి సెంటర్‌లో ఇంటింటి సర్వే చేపట్టి... వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించినట్లు వైద్యాధికారిణి వై.హేమ గురువారం తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రవి ఆదేశాల మేరకు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు కాలనీలలో ఇంటింటి సర్వేను చేపట్టి కలుషితమైన నీటిని తాగడం వలన అతిసార వస్తుందని కాలనీ ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. అతిసార వ్యాధి వచ్చిన ప్రాంతాలలో గ్రామ పంచాయతీ శానిటేషన్ పనులను చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు పూర్తి ఆరోగ్యంతో ఇంటికి చేరుకున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ అంకమ్మ రావు, హెల్త్ సూపర్‌వైజర్ కోటేశ్వరరావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సందడి వాతావరణం



మండలంలోని అబ్బూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు హాజరవుతున్న విద్యార్థులు



అబ్బూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసెంబ్లీలో విద్యార్థులు

సత్తెనపల్లి: నూతన విద్యా సంవత్సరం గురువారం ప్రారంభమైంది. పట్టణం, మండలంలోని పాఠశాలలన్నీ పునః ప్రారంభం కావడంతో సందడి వాతావరణం నెలకొంది. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చిన విద్యార్థులకు పాఠశాలలో మధ్యాహ్న భోజనం అందించారు. మొదటి రోజు కావడంతో అన్ని పాఠశాలల్లో విద్యార్థులు హాజరయ్యారు.

మోగిన బడి గంట

అమరావతి: వేసవి సెలవులు పూర్తయి బడి గంట మోగటంతో విద్యార్థులు మరలా పుస్తకాల సంచి సర్దుకుని బడిబాట పట్టాల్సిన సమయం ఆసన్నమైంది. వేసవి సెలవుల విరామానంతరం ప్రస్తుతం మండలంలో 3,967 మందికిపైగా విద్యార్థులు పాఠశాలలకు వెళ్లటానికి సమాయత్తమవుతున్నారు. ఏప్రిల్ 24వ తేదీ నుంచి సుమారు 50 రోజుల పాటు ఆటపాటలతో, బంధువులతో ఉల్లాసంగా, ఉత్సాహంగా వేసవి సెలవులను గడిపిన విద్యార్థులు మరలా చదువుపై దృష్టి మరల్చాటానికి సిద్ధమవుతున్నారు. మరలా బడులు తెరుచుకోవటంతో విద్యార్థుల తల్లిదండ్రులలో హడావుడి నెలకొంది. యూనిఫాం, పుస్తకాలు, ఫీజులు, బూట్లు తదితర వస్తువుల మరలా కొత్తవి కొనుగోలు చేయటం, విద్యార్థులను ప్రభుత్వ గుర్తింపు కలిగిన పాఠశాలల్లో చేర్పించటానికి తల్లిదండ్రులు ప్రయత్నాలు ప్రారంభించారు. గురువారం మండల పరిధిలోని పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉంది. కొందరు యూనిఫాంలో రాగా.. మామూలు దుస్తులలో కొందరు విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

రాజుపాలెం: వర్షాలు కురుస్తున్నందున ముందస్తుగా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా పర్యవేక్షకులు హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు తెలిపారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చౌట పాపాయపాలెంలో మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ గ్రామస్తులతో మాట్లాడుతూ దోమల వలన మలేరియా, డెంగీ, బోదకాలు, మెదడువాపు వంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. అందువలన ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పరిసర ప్రాంతాలలో మురికి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరు దోమ తెరలు వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ దేవా నాయక్, ఏఎన్ఎంలు ప్రమీలాభాయి, సాధిక్ హుస్సేన్, ఆశా కార్యకర్తలు రెబ్బమ్మ, మద్దెమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చండి



చిలకలూరిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో కూడిన నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో కె.లక్ష్మి కోరారు. పట్టణంలోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్ల కార్యక్రమంలో గురువారం ఎంఈవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగు, బూట్లు, సాక్స్‌లు, బెల్టులు, మూడు జతల యూనిఫాం ఇస్తున్నట్లు చెప్పారు. వీటితో పాటు డిజిటల్ విద్యాబోధన చేస్తున్నట్లు వివరించారు. అందరూ ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థులకు పోషక విలువలు కలిగిన మధ్యాహ్న భోజనంలో భాగంగా గుడ్డు, చిక్కీ, రాగిజావ అందిస్తామని చెప్పారు. సమగ్రశిక్ష ఉత్తర్వుల మేరకు 90 రోజుల పాటు అన్ని పాఠశాలల్లో రెడీనెస్ కార్యక్రమం నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఆరోగ్యకరమైన జీవన విధానం అమలు, వాతావరణ మార్పులు, ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన పెంపొందించు కోవాలన్నారు. చెట్ల పెంపకం, దాని ఆవశ్యకత ఉపయోగాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె.సుధ, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు గర్వకారణం

గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్, విద్యాదాత నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల: ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి చిరుమామిళ్ళ గ్రామానికి మంచి పేరు తీసుకురావటంలో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్, విద్యాదాత నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళలోని నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ పాఠశాలలను గురువారం ఆయన సందర్శించి ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుమామిళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 61 మంది విద్యార్థులకు గాను నూరు శాతం ఫలితాలు సాధించారని, వరుసగా ఆరుసార్లు నూరు శాతం ఉత్తీర్ణత సాధించటం అభినందనీయమన్నారు. ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థిని గాయత్రి సంజీవని 590 మార్కులతో మండలంలో ద్వితీయ స్థానంలో నిలవటం గర్వకారణమన్నారు. మూడో స్థానంలో తమ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సాధించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏపీ మోడల్ పాఠశాల హెచ్ఎం ఝాన్సీవాణి, జెడ్పీ హైస్కూలు హెచ్ఎం సుందరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న పాఠశాలలు

పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లారు. మొదటి రోజు ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లింగాల ధనలక్ష్మి తెలిపారు. పుస్తకాలు వచ్చిన వెంటనే విద్యార్థులందరికీ అందజేస్తామని తెలిపారు.

453 మందికి క్షయవ్యాధి నివారణ వ్యాక్సిన్



రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో క్షయవ్యాధి (టీబీ) నివారణకు 453 మంది వ్యాక్సిన్ వేయించుకున్నట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. రెంటచింతల పీహెచ్‌సీలో, 11 గ్రామాలలో నున్న విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో 60 సంవత్సరాలు పైబడిన వారికి, పొగతాగే వారికి, షుగర్ ఉన్న వారికి, 5 సంవత్సరాల కిందట టీబీ ఉన్న వారికి.. వారి కుటుంబ సభ్యులకు ఈ వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. క్షయ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా వ్యాక్సిన్ వేయించుకోవడం చాలా మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.కోటేశ్వరరావు, పీహెచ్‌సీ సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మండుతున్న ఎండలు

మాచర్ల: నాలుగురోజులుగా పట్టణంలో వర్షం కురిసింది. గురువారం ఉదయం నుంచి ఎండలు మండుతున్నాయి. పూర్తి స్థాయిలో భూమి చల్లబడకపోవడంతో ఉదయం నుంచే ఎండ వేడిమితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం వరకు ఎండ ప్రభావం ఉండటంతో వేడి గాలులతో ప్రజలు అవస్థలు పడ్డారు.

ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్

సత్తెనపల్లి: ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాను సారం మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 29న సత్తెనపల్లిలో ఉన్న కోర్టుల నందు జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని సత్తెనపల్లి మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో కోర్టులలో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు కేసులు, మనోవర్తి కేసులు, సివిల్ తగాదాలు, రెవెన్యూ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించబడతాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని వారి కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ రాజీనామా

క్రోసూరు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి చెందిన నేపథ్యంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, పాలకవర్గ సభ్యులు రాజీనామా చేసినట్లు యార్డు కార్యదర్శి ఈశ్వరరావు గురువారం తెలిపారు. ఈ నెల 10వ తేదీన చైర్మన్, పాలక వర్గ సభ్యులందరూ రాజీనామా చేసినట్లు రాత పూర్వక పత్రం అందజేసినట్లు తెలిపారు.

పాఠశాలలో సంసిద్ధత మేళా కార్యక్రమం



దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలోని మోడల్ ఫౌండేషన్ స్కూల్‌లో సంసిద్ధత మేళా కార్యక్రమం గురువారం నిర్వహించారు. గత ఏడాది పల్నాడు జిల్లాలో రెండు పాఠశాలలను మోడల్ ఫౌండేషన్ స్కూల్స్‌గా ప్రభుత్వం ఎంపిక చేసింది. అందులో ఒకటైన దమ్మాలపాడు గ్రామంలోని రామాపురం కాలనీలో గల ప్రాథమిక పాఠశాలలో పాఠశాలల పునఃప్రారంభంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు తోకల అచ్చయ్య చెప్పారు. ఐదు సంవత్సరాలు నిండిన అంగన్‌వాడీ విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు సురేష్, గ్రామస్తులు కళ్ళం కోటిరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలకు విద్యా సామగ్రి అందజేత



ఆటోలో పాఠ్యపుస్తకాలు తరలిస్తున్న ఉపాధ్యాయులు

వెల్దుర్తి: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు విద్యా సామగ్రిని అందించేందుకు పాఠశాలలకు మెటీరియల్‌ను అందించినట్లు ఎంఈవో కాంతారావు తెలిపారు. గురువారం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 4,383 మంది విద్యార్థులకు బ్యాగులు, పాఠ్యపుస్తకాలు అందించేందుకు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మెటీరియల్ అందజేయటం జరిగిందన్నారు. హెచ్ఎంలు పాఠశాలల్లో విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. మొదటి రోజే పాఠశాలలకు విద్యార్థులు అత్యధికంగా హాజరైనట్లు తెలిపారు. విద్యార్థుల కోసం పాఠశాల ప్రారంభానికి ముందే కావాల్సిన మెటీరియల్‌ను సేకరించి పాఠశాలల ప్రారంభం రోజే మెటీరియల్ అందజేయటం జరిగిందన్నారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అన్ని తరగతుల పాఠ్యపుస్తకాలను వివిధ పాఠశాలలకు అందించటం జరిగిందన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని మంచి భవిష్యత్తును ఏర్పరచుకోవాలన్నారు. ఉపాధ్యాయులందరూ సక్రమంగా విధులకు హాజరై విద్యార్థులకు చక్కని విద్యా బోధన చేయాలన్నారు. హెచ్ఎంలు ఆటోలలో పాఠశాలలకు కావాల్సిన మెటీరియల్‌ను తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీ పురుషోత్తం, హెచ్ఎం పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్‌కు ఈకేవైసీ తప్పనిసరి



హెచ్‌పీ గ్యాస్ కంపెనీ వద్ద వినియోగదారులు

పిడుగురాళ్ల: వంట గ్యాస్ కావాలంటే తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించాల్సిందే. లేకుంటే వంట గ్యాస్ సరఫరా అవ్వదు. ప్రభుత్వ రాయితీలు రావు అని గ్యాస్ వినియోగదారులు ఈ కేవైసీ చేయించుకునేందుకు వంట గ్యాస్ కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు. గ్యాస్ కార్యాలయ నిర్వాహకులు కూడా తమ వంట గ్యాస్ వినియోగదారులకు సమాచారం ఇచ్చి కార్యాలయాల వద్ద ఈ కేవైసీ నిర్వహిస్తున్నారు. ఈ కేవైసీ కావాలంటే ఆధార్‌కార్డుకు గ్యాస్ కనెక్షన్ అనుసంధానమై ఉండాలి. అనుసంధానం అయి ఉంటే ఈ కేవైసీ 5 సెకన్లలో పూర్తి అవుతుంది. ఒక వేళ ఆధార్ కార్డుకు గ్యాస్ కనెక్షన్ అనుసంధానం కాని పక్షంలో ఆధార్ కార్డుకు గ్యాస్ కనెక్షన్ అనుసంధానం చేసి సంబంధిత బ్యాంక్ నుంచి దరఖాస్తు చేసుకుంటే సుమారు 10 నుంచి 15 రోజులకు ఆధార్‌కార్డు అనుసంధానంతోపాటు బ్యాంక్ ఖాతా లింక్ అవుతుంది . ఆ తర్వాత ఈ కేవైసీ ఆమోదిస్తుంది. గ్యాస్ వినియోగదారులందరు తప్పనిసరిగా ప్రతి ఒక్కరు వారి గ్యాస్ కార్యాలయం వద్ద ఈ కేవైసీ చేయించుకోవాలని వంట గ్యాస్ కార్యాలయ నిర్వాహకులు తెలుపుతున్నారు.

పశువులకు గొంతువాపు నివారణ టీకాలు వేయించాలి

పశు వైద్యాధికారి డాక్టర్ పి.స్వాతీదేవి



వేల్పూరులో పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

అచ్చంపేట: ప్రస్తుత వర్షాకాలం ఆరంభంలో పశువులలో ఎక్కువగా గొంతువాపు వ్యాధి, గురక వ్యాధులను గమనిస్తామని వాటి నివారణకు తక్షణమే పశు వైద్యశాలలకు పశువులను తీసుకెళ్లి టీకాలు వేయించాలని అచ్చంపేట పశు వైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి తెలిపారు. గత రెండు రోజులుగా దీనిపై మండలంలో పలు గ్రామాలలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జూన్, జూలై మాసాలలో పడే వర్షాలకు పశువులు తడిసిన పచ్చిగడ్డిని మేయడం వల్ల అందులో ఉండే సూక్ష్మ కీటకాల వల్ల ఈ వ్యాధి ఉధృతమవుతుందని చెప్పారు. అప్పుడు పశువులకు 102 నుంచి 104 డిగ్రీల టెంపరేచర్ ఉంటుందని, గొంతు కింద భాగంలో వాపు కనిపించి, శ్వాస తీసుకోవడంలో పశువులు ఇబ్బందులకు గురవడాన్ని గమనిస్తామన్నారు. ఆహారం తీసుకోవడం కష్టంగా ఉండి గురక పెడతాయని చెప్పారు. అలాంటి లక్షణాలున్న పశువులను వెంటనే దగ్గరలో ఉన్న పశు వైద్యశాలలకు తీసుకెళ్లి టీకాలు వేయించాలని సూచించారు. ఇప్పటివరకు మండలంలో 3 వేలకు పైగా పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు చెప్పారు. వ్యాధి లక్షణాలు కనిపించకపోయినా పశువులకు ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా టీకాలు వేయొచ్చన్నారు. పశు పోషకులు వెంటనే తమ పశువులను దగ్గరలోని పశు వైద్యశాలలకు తీసుకెళ్లి టీకాలు వేయించాలని ఆమె కోరారు.

ఎస్‌వీఎల్ఎన్ మెమోరియాల్ క్రికెట్ టోర్నమెంట్ విజేత శివారాక్స్



గెలుపొందిన శివారాక్స్ జట్టును అభినందిస్తున్న పురోహిత సంఘ నాయకులు

సత్తెనపల్లి: పట్టణంలో గత మూడు రోజులుగా శ్రీ వేద గాయత్రి పురోహిత సంఘం ఆధ్వర్యంలో ఎస్‌వీఎల్ఎన్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా జరిగింది. ఈ టోర్నమెంట్‌లో సత్తెనపల్లి బ్రాహ్మణ పురోహిత సభ్యులందరూ రెండు జట్లుగా పాల్గొన్నారు. బెస్ట్ ఆఫ్ త్రీ ఆడగా ఏపీ కింగ్స్‌పై శివారాక్స్ టీం వరుసగా రెండు సార్లు విజయం సాధించి విజేతగా నిలిచింది. గురువారం గెలుపొందిన శివారాక్స్ జట్టు క్రీడాకారులను పురోహిత సంఘం నాయకులు అంపిరాయని రాజశేఖర్ శర్మ, మోతే పురుషోత్తమ శర్మ, కోనంకి మారుతిలు అభినందించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పురోహితులు పాల్గొన్నారు.

ఉత్తమ ర్యాంకు సాధించడం సత్తెనపల్లికి గర్వకారణం



శావ సిరిని అభినందించి షీల్డ్ అందిస్తున్న డీఎస్పీ గుర్‌నాథ్‌బాబు

సత్తెనపల్లి: రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడం సత్తెనపల్లికి గర్వకారణమని సత్తెనపల్లి డీఎస్పీ జి.గుర్‌నాథ్‌బాబు అన్నారు. ఈ నెల 11న విడుదలైన ఎంసెట్ ఫలితాలలో స్టేట్ 4,335వ ర్యాంక్ సాధించిన సత్తెనపల్లి సిద్దికా కోచింగ్ సెంటర్ విద్యార్థిని శావ సిరిని గురువారం ఆయన శాలువాతో సన్మానించి షీల్డ్ బహూకరించారు. సిద్దికా కోచింగ్ సెంటర్ డైరెక్టర్స్ షేక్ సుభాని, షేక్ అహ్మద్‌లు రూ.6 వేలు నగదు ప్రైజ్‌ను సిరికి అందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ గుర్‌నాథ్ బాబు మాట్లాడుతూ ఇలాంటి మంచి ర్యాంకులు సాధిస్తున్న సిద్దికా కోచింగ్ సెంటర్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.

జేఈఈ మెయిన్‌లో వినుకొండ విద్యార్థుల ప్రతిభ

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు ఏపీ ఎంసెట్, ఆల్ ఇండియా జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో విజయభేరి మోగించారు. రేటూరి రాజేంద్ర 3079వ ర్యాంక్ సాధించి ఐఐటీలో సీటు పొందేందుకు అర్హత సాధించాడని కళాశాల డైరెక్టర్ డాక్టర్ యడవల్లి శ్రీనివాస శర్మ, ప్రిన్సిపాల్ శ్రీవల్లిపావనిలు తెలిపారు. అదేవిధంగా ఎంసెట్ ఇంజినీరింగ్, మెడికల్‌లో 23 మంది విద్యార్థులు అత్యుత్తమ ర్యాంక్‌లు సాధించారని, మొత్తం 70 మంది పరీక్షలు రాయగా 60 మంది అర్హత సాధించినట్లు తెలిపారు. ర్యాంక్‌లు సాధించుటకు కృషి చేసిన అధ్యాపకులను, విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఈ సందర్భంగా యాజమాన్యం అభినందించింది.